
ప్రజాశక్తి
గురువారం 23 జనవరి 2025 5 విజయనగరం



మార్చి 31లోగా బిపిఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

ప్రజాశకి-విజయనగరం టౌన్

పెండింగ్‌లో ఉన్న లే అవుట్, భవన క్రమబద్ధీకరణ దరఖాస్తుల సమస్యలను మార్చి 31వ తేదీ కన్నా ముందుగానే పరిష్కరించాలని సిబ్బందికి అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ ప్రణాళికా కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు లేఅవుట్ క్రమబద్ధీకరణ కోసం 607 దరఖాస్తులు రాగా, వాటిలో 462 దరఖాస్తులకు అనుమతి లభించిందన్నారు. ఇంకా 145 పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించేందుకు దరఖాస్తుదారులను, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ తోను సంప్రదింపులు జరపాలన్నారు. భవన క్రమబద్ధీకరణ పథకం కింద 55 దరఖాస్తుల రాగా, 32 పెండింగ్‌లో ఉన్నాయని, 19 దరఖాస్తులను తిరస్కరించామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్నవాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆరిన ఆశా దీపం

పరుగు పోటీలో ఊపిరి వదిలిన కానిస్టేబుల్ అభ్యర్థి

కోమటిపల్లిలో విషాదం

కుమారుడు బాగా చదువుకొని ఉద్యోగం చేసి తమను పోషిస్తాడని కలలు గన్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. కానిస్టేబుల్ ప్రాథమిక అర్హత పరీక్షలో ఉత్తీర్ణుడై దేహదారుఢ్య పరీక్షకు ఎంపికైన తమ బిడ్డ తప్పకుండా కానిస్టేబుల్ అవుతాడని భావించిన తల్లిదండ్రులకు పుత్ర శోకమే మిగిలింది. పరుగుపోటీకి వెళ్లొస్తానని తల్లిదండ్రులకు చెప్పిన కొడుకు ఆ పరుగులోనే ప్రాణాలు విడవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. తమ కలల దీపం ఆరిపోవడంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు.



రవికుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-దత్తిరాజేరు/విజయనగరంకోట

స్వయిఫండరీ పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకానికి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 21న జరిగిన దేహ దారుఢ్య (పిఇటి) పరీక్షల్లో పాల్గొన్న దత్తిరాజేరు మండలం కోమటిపల్లికి చెందిన బౌడుపల్లి రవి కుమార్ (22) మృతి చెందాడు. 16 వందల మీటర్లు పరుగు పోటీలో పరుగెడుతూ మధ్యలో కుప్పకూలి పోయాడు. తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కోమటిపల్లికి చెందిన బవురుబిల్లి అప్పలరాము, అక్కమ్మ దంపతుల కుమారుడు రవి కుమార్ (22) డిగ్రీ చదువుకున్నాడు. పోలీసుకానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక రాతపరీక్షలు ఉత్తీర్ణుడైన రవికుమార్ మంగళవారం నిర్వహించిన దేహ దారుఢ్య పరీక్షకు హాజరయ్యాడు. పిఇటి పరీక్షల్లో ప్రాథమిక అర్హత పరీక్ష అయిన 1600 మీటర్ల పరుగులో పాల్గొన్నాడు. పరుగెడుతూ..పరుగెడుతూ అస్వస్థతతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నారన్నాడు. అక్కడే ఉన్న అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, వైద్య సిబ్బంది 108 వాహనంలో మహారాజా సర్వజన ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అయినప్పటికీ, అభ్యర్థి ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో నగరంలోని తిరుమల-మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌పి వకుల్ జిందాల్ ఆస్పత్రిలో రవికుమార్‌ను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వారి సూచనల మేరకు అక్కడి నుంచి మంగళవారం రాత్రి విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో రవికుమార్ కన్నుమూశాడు.

అప్పలరాము, అక్కమ్మకు ముగ్గురు పిల్లల్లో చిన్నవాడు రవిశంకర్. వ్యవసాయ కూలి పనులు చేసుకొని పిల్లలను చదివించారు. పెద్దకుమారుడు గుజరాత్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, అక్క రాజేశ్వరికి వివాహమైంది. రవిశంకర్ డిగ్రీ వరకు చదువుకొని ప్రభుత్వ ఉద్యోగానికి ప్రిపేరవుతున్నాడు. కానిస్టేబుల్ పోస్టుకు ప్రాథమిక రాత పరీక్షలు అర్హత సాధించడంతో తల్లి దండ్రులు మురిసి పోయారు. తమ కుమారుడికి కానిస్టేబుల్ ఉద్యోగం వస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.కానీ ఉద్యోగం కోసం పరుగుపోటీలో రవికుమార్ ప్రాణాలు వదలడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.



రవికుమార్ (ఫైల్)

ప్రశాంతంగా జెఇఇ మెయిన్స్

అభ్యర్థులు ఉరుకులు..పరుగులు ● ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఇంజినీరింగ్, బిఆర్క్‌లో ప్రవేశాలకు ఎన్‌టిఎ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జెఇఇ (జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) మెయిన్స్ పరీక్ష బుధవారం జిల్లాలో తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. ఈనెల 22 నుంచి 30వరకు జరుగనున్న ఇంజినీరింగ్, బిఆర్క్ పరీక్షలకు జిల్లాలోని ఎంవిజిఆర్, గాజులరేగలోని ఐయాన్ డిజిటల్ కేంద్రాలను కేటాయించారు. ఈ రెండు కేంద్రాల్లోనూ 5447 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే తొలి సెషన్ పరీక్ష రాసేందుకు అభ్యర్థులు ఉదయం 7గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగింది. రెండుగంటల ముందే పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని ఆదేశించడంతో అభ్యర్థులు ఉదయం 7గంటలకే చేరుకున్నారు. విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చినప్పటికీ అయాన్ డిజిటల్ జోన్ సిబ్బంది విద్యార్దులు హాల్ టికెట్‌లు సరి చూసుకునేందుకు నోటీసుబోర్డు పెట్టలేదు. అప్పటికే విద్యార్దులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో ఏడున్నర గంటల సమయంలో హాల్ టికెట్స్ నెంబర్లతో కూడిన నోటీసులు అంటించారు. దీంతో విద్యార్దులు తల్లి తండ్రులు సిబ్బంది తీరుపై మండిపడ్డారు. తాము ఏడు గంటలకే చేరుకున్నా అయాన్ డిజిటల్ జోన్ సిబ్బంది హాల్ టికెట్స్ చూసుకునేందుకు బోర్డు లు పెట్టకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఎన్‌టిఎ విధించిన నిబంధనలతో విద్యార్థినుల తలకు ఉన్న శంపిన్నులను అక్కడే తీసేయాల్సి వచ్చింది. ఏడున్నర గంటలకు ఒక్కో విద్యార్థిని తనిఖీ హాల్ టిక్కెట్‌ను, గుర్తింపుకార్డును పరిశీలించి లోపలకు అనుమతించారు. 8.45గంటలకు వచ్చిన విద్యార్థులను అనుమతించకపోవడంతో తల్లిదండ్రులు అక్కడి సిబ్బంది బతిమలాడడంతో లోపటకు అనుమతించారు. ఉదయం 8.50 గంటల సమయంలో ముగ్గురు విద్యార్థులు పరీక్ష రాసేందుకు రావడంతో అప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తయినందున లోపలికి అనుమతించేది లేదని సిబ్బంది తేల్చి చెప్పారు. విద్యార్థుల తల్లి తండ్రులు బతిమాలినా సమయం అయిపోయిందని అనుమతించక పోవడంతో వారు తిరుగు ముఖం పట్టారు.



సమయం ముగిసి గేటుకు తాళం వేయడంతో బయట ఉండిపోయిన విద్యార్థులు





పరీక్షా కేంద్రం బయట వేచిఉన్న విద్యార్థులతో తల్లిదండ్రులు ; సమయం కావడంతో పరీక్షా కేంద్రానికి పరుగెత్తుకుంటూ వస్తున్న విద్యార్థిని

నెలాఖరుకు పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ

విద్యాశాఖ వర్క్‌షాప్‌లో కలెక్టర్ అంబేద్కర్



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతిలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జీవో117 ఉపసంహరణ- పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియపై ఎంఇఒలకు, పాఠశాలల క్లస్టర్ హెచ్‌ఎంలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, పునర్‌వ్యవస్థీకరణ కారణంగా ఏ ఒక్క విద్యార్థీ నష్టపోకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు పాఠశాలకు చేసే రాకపోకలు, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులకు కూడా ఎటువంటి నష్టం జరగకూడదని, అందుబాటులో ఉన్న భవనాలు, ఇతర మౌలిక వసతులు వృథా కాకుండా వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొనే విధంగా పునర్ వ్యవస్థీకరణను నిర్వహించాలని ఆదేశించారు. ఒకవేళ ఉపాధ్యాయులను మిగులు చూపినా, వారిని ఇతర జిల్లాలకు పంపించేది లేదని, వారి సేవలను ఇక్కడే వినియోగించుకుంటామని తెలిపార. ప్రీ ప్రైమరీ స్కూల్స్ విషయంలో ఐసిడిఎస్ సిబ్బందితో కూడా చర్చించాలన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా, ఈ నెల 25 నాటికి అత్యంత ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యం నాయుడు మాట్లాడుతూ, జిల్లాలోని పాఠశాలల వివరాలు, ప్రభుత్వ ఆదేశాలను వివరించారు. జిల్లాలో 232 ఉన్నత పాఠశాలలు, 1317 ప్రాథమిక పాఠశాలలు, 168 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో సుమారు 1,05,547 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వీరిలో 61,443 మంది ఉన్నత పాఠశాలల్లో, 31,375 మంది ప్రాథమిక పాఠశాలల్లో, 12,529 మంది ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో 3365 మంది, ప్రాథమిక పాఠశాలల్లో 3317 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 952 మంది ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని చెప్పారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు 303, ఇద్దరు ఉపాధ్యాయులతో నడుస్తున్నవి 221 పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 162 క్లష్టర్లను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 131 క్లష్టర్లుగా మార్చడం జరుగుతుందని డిఇఒ వివరించారు. ఈ వర్క్‌షాపులో విద్యాశాఖ ఎడి గౌరీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణపై శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో పిహెచ్‌సిల వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులతో మలేరియా నియంత్రణ శిక్షణ కార్యక్రమాలను బుధవారం రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ ఎస్. సుబ్రహ్మణ్యేశ్వరి నిర్వహించారు. 2027నాటికి మలేరియా నిర్మూలన లక్ష్యంగా ఉండాలని తెలిపారు. ప్రతి రెండు వారాలకు గృహాల సందర్శన చేపట్టాలని, మలేరియా లక్షణాలుంటే రక్తపూతలు సేకరించి పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ జీవన రాణి, జిల్లా మలేరియా అధికారి వై. మణి, విశాఖ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, గుంటూరు జోన్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.వీర్రాజు, ప్రోగ్రాం ఆఫీసర్ పాల్గొన్నారు.

26న ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు

విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి విజయనగరం జిల్లా శాఖ ఎన్నికలు ఈనెల 26న ఉదయం 10.30 గంటల నుండి జిల్లా ఖజానా కార్యాలయంలో జరుగుతాయని ఎన్నికల అధికారి ఎ.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి వికలాంగ పింఛన్ల పునఃపరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంకోట

వికలాంగుల పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియను గురువారం నుంచి జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో తమ ఛాంబర్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 36,974 వికలాంగ పింఛన్లు ఉన్నాయని తెలిపారు. పింఛను పొందుతున్న వికలాంగులు తమకు కేటాయించిన తేదీలో, ఆయా ఆసుపత్రులకు వెళ్లి పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు. దీనికోసం జిల్లాలోని ఐదు ఆసుపత్రుల్లో మొత్తం 13 ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శారీక వికలాంగులకోసం ఏరియా ఆసుపత్రులు గజపతి నగరం, చీపురుపల్లి, రాజాం, ఎస్.కోటతోపాటు విజయ నగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)లో పరిశీలనా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంథులకోసం రాజాం, జిజిహెచ్, మూగ, చెవిటి వారి కోసం జిజిహెచ్, ఘోషా ఆసుపత్రిలో, మానసిక వికలాంగులకోసం కూడా విజయనగరం జిజిహెచ్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా అందిన నోటీసుల్లో ఇచ్చిన తేదీ, సమయానికి మాత్రమే వీరు ఈ కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు. పింఛన్లను రద్దు చేస్తారని అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేవలం పునఃపరిశీలన మాత్రమే జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిఎంఅండ్‌హెచ్‌ఒడాక్టర్ ఎస్.జీవనరాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పింఛన్లు తొలగిస్తే ఊరుకోం : జెడ్‌పి చైర్మన్

విజయనగరం టౌన్ : వికలాంగుల పింఛన్ల పునఃపరిశీలన పేరుతో పింఛన్లను తొలగిస్తే ఊరుకోబోమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సామాజిక పింఛన్లను తగ్గించే కార్యక్రమంలో భాగంగానే ప్రభుత్వం ఈ పునః పరిశీలన కార్యక్రమానికి తెరలేపిందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏళ్ల తరబడి పింఛన్ పొందుతున్న కదల్లేని స్థితిలో దయనీయ పరిస్థితిలో ఉన్న పింఛనుదారులంతా ఇప్పుడు తమ పింఛను ఉంటుందో, ఊడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు రూ.6వేలు పింఛన్ పొందుతున్న వికలాంగుల పింఛన్లను గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా సర్వే చేయడానికి ప్రారంభించడానికి అధికారులు నిర్ణయించడంతో, వీరిలో కూడా ఆందోళన మొదలయ్యిందని పేర్కొన్నారు.



డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తికి వినతినిస్తున్న యుటిఎఫ్ నాయకులు

తక్షణమే 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

ఐఆర్ ప్రకటించాలి : డిఆర్‌ఒకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్‌ను ప్రకటించాలని, ఐఆర్ ఇవ్వాలని కోరుతూ డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తికి యుటిఎఫ్ నాయకులు బుధవారం వినతి అందజేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని, 1.7.2023 నుండి 12వ పే రివిజన్ కమిషన్ అమలు కావాల్సి ఉన్నా, నేటికి కనీసం కమిటీని కూడా నియమించకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు 18 నెలల కాలాన్ని కోల్పోవల్సి వచ్చిందని తెలిపారు. గత 11వ పిఆర్‌సికి సంబంధించిన బకాయిలు రూ.7384 కోట్లు, డి ఎ బకాయిలు రూ.9650 కోట్లు, ఎంప్లాయ్ సరెండర్ లీవ్ రూ.2250 కోట్లు, సిపిఎస్ ఎంప్లాయిస్ బకాయిలు రూ.2500 కోట్లు, ఎపిజిఎల్ఐ రూ.950 కోట్లు చెల్లించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఐఆర్ 29శాతం వెంటనే ప్రకటించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర విద్యావిభాగంసబ్‌కమిటీ సభ్యులు డి.రాము, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాద్ రావు సిహెచ్ తిరుపతి నాయుడు, ఎం.సత్యనారాయణ, జి. రాజారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్ , నాయకులు పి రామకృష్ణ, బి.శ్రావణ్ కుమార్, వి.బంగార్రాజు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య 15వ డివిజన్ లో పర్యటించారు. రాజారావు మేడ, ఇప్పిలి వీధి, అద్దేపల్లి వారి వీధి, కోలగట్ల వారి వీధి, గుంటూరు వారి వీధి, తెలకల వీధి, గొంప వీధి, గౌడ వీధి తదితర ప్రాంతాలలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తగు ఆదేశాలు ఇచ్చారు. గొంపువీధిలో ఉన్న సామాజిక మరుగుదొడ్లను తనిఖీ చేశారు. డివిజన్లో కొన్నిచోట్ల నిబంధనలకు వ్యతిరేకంగా చేపట్టిన నిర్మాణ పనులను తక్షణమే తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. తెలకల వీధి రామ మందిరం వద్ద ఉన్న సామాజిక మరుగుదొడ్డి ని త్వరగా ప్రారంభించే విధంగా చొరవ చూపాలని సూచించారు. కోలగట్ల వారి వీధిలో కాలువకు అడ్డంకిగా నిర్మించిన నిర్మాణాన్ని తొలగించి వేయాలని ఆదేశించారు. పర్యటనలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్‌ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, డిఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోటళ్ల రహదారికి భూములిచ్చేది లేదు

తేల్చి చెబుతున్న దిబ్బలపాలెం రైతులు

ప్రజాశక్తి కథనంతో సమావేశమైన అన్నదాతలు

నేడు అధికారులతో చర్చించనున్న ఎమ్‌డి

హాజరుకానున్న భీమిలి, భోగాపురం మండల రెవెన్యూ అధికారులు



హోటల్ రహదారి కోసం సేకరించనున్న భూములు ఇవే..

ప్రజాశక్తి - భోగాపురం

పర్యాటక ముసుగులో ప్రైవేటు హోటల్ రహదారికి భూములిచ్చేదిలేదని దిబ్బలపాలెం రైతులు తెగేసి చెబుతున్నారు. ఇప్పటికే విమానాశ్రయ నిర్మాణానికి భూములిచ్చామని మళ్ళీ ఇప్పుడు రహదారి కోసం ఉన్న భూములు తీసుకుంటే ఒప్పుకునేది లేదని ఖరాఖండిగా చెబుతున్నారు. ఒబరాయ్ హోటల్‌కు వెళ్ళేందుకు రహదారికి భూసేకరణ కోసం ఇటీవలి రెవెన్యూ అధికారులు సర్వే నెంబర్లు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించారు. దీనిపై ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం వచ్చింది. దీనిపై అప్రమత్తమైన రైతులు ఇటీవలి సమావేశమై చర్చించుకున్నారు. ఇంతలో మరో పక్క పర్యాటక శాఖ అధికారులు మాత్రం ఈ రహదారి కోసం విశాఖలో భీమిలి, భోగాపురం మండలాల రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తుండడం గమనార్హం.

మండలంలోని కంచేరు రెవెన్యూ సరిహద్దులో విశాఖ జిల్లా అన్నవరం రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వం హయాంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సముద్ర తీరాన పాండవుల పంచగా పేరొందిన ప్రదేశంలో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఒబరాయ్ హోటల్ నిర్మాణానికి కేటాయించిన విషయం తెలిసిందే. దీని నిర్మాణానికి సంబంధిత హోటల్ సంస్థ సిద్ధమవుతోంది. అందుకు అవసరమైన సామాగ్రి తరలించాలంటే ప్రస్తుతం ఉన్న దిబ్బలపాలెం నుంచి తూడెం వెళ్ళే రహదారిలోనే తరలించాలి. కాని ఈ రహదారి చిన్నది కావడంతో దీనిని వెడల్పు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు 2కిలోమీటర్లు రహదారిని 80 అడుగుల వెడల్పుతో రహదారిని విస్తరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

నేడు రెండు మండలాల రెవెన్యూ అధికారులతో విశాఖలో సమీక్ష

ఈ రహదారికి సంబంధించి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆశాఖ ఎమ్‌డి కె.అమ్రపాలి విశాఖపట్నంలో గురువారం సమావేశం నిర్వహిస్తోన్నట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇటు భోగాపురం మండల రెవెన్యూ అధికారులతో పాటు అటు విశాఖ జిల్లా భీమిలి మండల రెవెన్యూ అధికారులు హాజరవ్వనున్నట్లు రైతులే చెబుతున్నారు. ఒబరాయ్ హోటల్‌కు రహదారికి సంబంధించిన విషయాలపై ప్రధానంగా చర్చించనున్నారని తెలుస్తోంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదు

రహదారి విస్తరణకు ఎట్టి పరిస్థితుల్లోను భూములు ఇచ్చేది లేదు. ఇప్పటికే విమానాశ్రయ నిర్మాణానికి భూములను తీసుకున్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని మళ్ళీ రహదారిపేరుతో తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు మా భూములను బలిచ్చే పరిస్థితే లేదు.

నీలాపు నరసయ్యమ్మ, మహిళా రైతు, దిబ్బలపాలెం

ప్రైవేటు సంస్థకు మా భూములు ఎలా తీసుకుంటారు

ప్రైవేటు సంస్థ నిర్మిస్తున్న హోటల్‌కు వెళ్ళేందుకు రహదారి కోసం మా భూములను తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాని ప్రైవేటు సంస్థ వ్యాపారం చేసుకునేందుకు మా భూములు సేకరించి రహదారి కోసం ఇవ్వడం చాలా దారుణం.

కొయ్య రమణ, రైతు, దిబ్బలపాలెం

అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

ఒబరాయ్ హోటల్‌కు వెళ్ళేందుకు అవసరమైన రహదారి మా భూముల్లో నుంచి వెడల్పు చేసేందుకు రెవెన్యూ అధికారులు భూసేకరణకు సిద్ధమవుతున్నారు. కానీ ఎట్టి పరిస్థితుల్లో కూడా భూములు ఇవ్వం. అవసరమైతే రైతులందరం ఏకమై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

నీలాపు అప్పలసూరి, రైతు, దిబ్బలపాలెం

24న పోస్టల్ మెగా మేళా

తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఈనెల 24న జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా విజయనగరం తపాలా డివిజన్ పరిధిలో గల అన్ని తపాలా కార్యాలయాలలో మెగా మేళా ను నిర్వహిస్తున్నట్లు విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మెగా మేళాలో 2000 సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను కొత్తగా తెరవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని తెలిపారు. పదేళ్లలోపు లోపు వయసు గల బాలికలకు ఈ ఖాతాను తెరవవచ్చునని, ఖాతా కాల పరిమితి 21 సంవత్సరాలని వివరించారు. బాలికలకు 18ఏళ్లు నిండినచో ఉన్నత విద్యకై గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉన్న మొత్తంలో 50శాతం వరకు విత్ డ్రా చేసుకోవచ్చునని లేదా వివాహ నిమిత్తం వివాహానికి నెల రోజులు ముందు కానీ వివాహానంతరం 3 నెలల లోపు పథకాన్ని ఉప సంహరించు కోవటానికి సదుపాయం ఉందని తెలిపారు. ఆర్థిక సంవత్సరానికి కనీసం రూ.250 మొదలు గరిష్టంగా రూ.1,50,000 వరకు చెల్లించ వచ్చునని, ఖాతాలో జమ చేసిన సొమ్ము మొత్తానికి పన్ను మినహాయింపు ఉందని తెలిపారు. ఖాతాలో సొమ్ము ను ఏ తపాలా కార్యలయం లో నైనా జమ చేయ వచ్చునని చెప్పారు. ఖాతాను ఏ తపాలా కార్యలయానికైనా బదిలీ చేసుకొనే సదుపాయం ఉందని, పూర్తి వివరాల కోసం దగ్గరలో ఉన్న తపాలా కార్యలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఘనంగా మాడపాటి జయంతి

విజయనగరంకోట : జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యాన బుధవారం మహలక్ష్మి జూనియర్ కళాశాలలో ఆంధ్ర పితామహుడు మాడపాటి హనుమంతరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ స ందర్భంఆ ఆ సంఘం అధ్యక్షులు కె.ఎర్నాయుడు మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి, తెలుగు సంస్కృతి వికాసానికి మాడపాటి ఎనలేని కృషి చేశారని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఎ.సింహాచలం నాయుడు మాట్లాడుతూ 1901లో గ్రంథాలయోద్యమానికి నాంది ప్రస్తావన జరిగిందని తెలిపారు కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

బొబ్బిలి : సిఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే బేబినాయన అందజేశారు. మండలంలోని గొంగాడవలస గ్రామానికి చెందిన జి.అప్పారావు అనారోగ్యంతో బాధ పడడంతో వైద్యానికి సీఎం సహాయ నిధి రూ.25వేలు చెక్కును కోటలో బుధవారం బేబినాయన అందజేశారు. పేదలకు సీఎం సహాయ నిధి ఎంతో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో జాగ్రత్తలు అవసరం

గజపతినగరం: మొక్కజొన్న పంటలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎఒ సిహెచ్ ధనలక్ష్మి అన్నారు. మండలంలోని తమ్మికాపల్లి, లోగిస గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కజొన్నలో పురుగులు, తెగుళ్లపై రైతులు దృష్టి పెట్టి సకాలంలో స్పందించాలన్నారు. అపరాలు పంటలు పెసర, మినుము పంటలో పూతదశలో ఎన్‌పికె 19-19-19ని స్ప్రే చేసుకోవడం వల్ల దిగుబడి పెరుగుతుందన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

నెల్లిమర్ల: మండలంలోని మొయిద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై ఎస్ఐ బి. గణేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చిన్న వయసు నుంచే మంచి అలవాట్లను, ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వారి తల్లిదండ్రులు వాళ్ల కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించి మంచి మార్గంలో నడవాలని, చక్కగా చదువుకోవాలని సూచించారు. తాత్కాలిక ఆనందాన్ని కలిగించే చెడు అలవాట్లు మందు సిగరెట్టు గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కాకూడదని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు కావాలి

రామభద్రపురం: ప్రభుత్వం నూతనంగా రైతు శ్రేయస్సుకు ప్రవేశపెడుతున్న ఫార్మర్ రిజిస్ట్రీలో ప్రతి రైతు కుటుంబం సభ్యులతో సహా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు తెలిపారు. బుధవారం ఆరికతోట, బూసాయవలస రైతు సేవా కేంద్రాలను సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫార్మర్ రిజిస్ట్రీ గురించి వివరించి ఇక నుంచి ప్రభుత్వం రైతులకు సంబంధించిన పథకాలను దీని ద్వారా అందించే అవకాశం ఉందని దీనిలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్ 12,632 హెక్టార్లకు గాను 1,23,771 మంది రైతుల ద్వారా సుమారు రూ.1.05కోట్లు పంటల బీమా ప్రీమియం వసూలు చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు ఈక్రాప్, ఇకెవైసి వివరాలు సంబంధిత రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవడం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ వెంకటయ్య, ఏఏఒ కొండలరావు, సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఇఒ

వేపాడ: మండల విద్యాశాఖాధికారి-1గా ఇంతవరకు పనిచేసిన ఎ.జగదీశ్వరరావు ఎస్. కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బదిలీ కావడంతో ఆ స్థానంలో ఎస్ నాగభూషణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గురుగుబిల్లి మండలంలో ఎంఇఒగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల నాయకులు పిన్నింటి వెంకటరమణ, జగదీశ్వరరావు, పి.చిరంజీవిరావు, ఎపిటిఎఫ్ నాయకులు గుమ్మడి నరసింహమూర్తి, సిహెచ్ అర్జునరావు పాల్గొని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

అధికారులతో సమీక్షించిన ఎంపిపి

భోగాపురం: మండలంలోని వివిధ శాఖల అధికారులతో ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల జీవన మిషన్‌లో భాగంగా పైప్‌లైన్ల కోసం కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా తవ్వేశారన్నారు. వాటిని మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అలేఖ్యకు సూచించారు. ఇంటింటి కొళాయిలు పూర్తయితే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 30న తేదీన జరిగే మండల పరిషత్ సమావేశానికి అధికారులు అంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎమ్.సురేష్, ఎంపిడిఒ కె.గాయత్రి, పశువైద్యాధికారులు కమలకుమారి, రామరాజు, పాల్గొన్నారు.

మార్చిలో కనకదుర్గమ్మ పండగ

భోగాపురం: భోగాపురం కనకదుర్గమ్మ పండగ తేదీలను బుధవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పండితులు ఖరారు చేశారు. మార్చి నెలలో 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ పండగ నిర్వహించనున్నారు. గ్రామ పెద్దలు కందుల రఘుబాబు, కొమ్మూరి సూర్యనారాయణ, కందుల హరీష్, రౌతు వాసు, ఆళ్ల ఉదయి బాబు, పడాల భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రేగిడి: మండలంలోని లక్ష్మీపురంలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేంబూరి వెంకటేష్, ఎంపిటిసి ఎర్నేని అప్పలనాయుడు, కేంబూరు గోవిందరావు, నారాయణరావు, గ్రామ పెద్దలు, జై భీమ్ యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు ఇన్‌ఫా లీడర్‌షిప్ అవార్డు

విజయనగరం టౌన్ : ప్రముఖ మానసిక నిపుణుడు, మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ఎన్‌విఎస్ సూర్యనారాయణకు సైకాలజీ రంగంలో చేసిన విస్తృత సేవలకు ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసియేషన్ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈమేరకు ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసియేషన్ ఇన్‌ఫా జాతీయ అధ్యక్షుడు, పుదుచ్చేరి విశ్వవిద్యాలయం యుజిసి, ఎంఎంటివి డైరెక్టర్ ప్రొఫెసర్ పంచ్ రామలింగం ప్రకటించారు. ఈ అవార్డును 'హిప్నోసిస్ ఎక్రాస్ లైఫ్ స్పాన్ :ప్రమోషన్, ప్రివెన్షన్ అండ్ ఇంటర్వెన్షన్' అనే అంశంపై ఈనెల 24-25 తేదీలలో పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగే సమావేశంలో పొండిచేరి ప్రజా సమాచార, పసార శాఖ రాష్ట్ర మంత్రి ఎల్. మురుగన్ చేతుల మీదుగా డాక్టర్ సూర్యనారాయణకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రొఫెసర్లు, ఉపకులపతులు, పూర్వ విసిలు అభినందనలు తెలిపారు.

జిఎస్‌ఆర్‌పురంలో లారీలు ఢీ

బొబ్బిలిరూరల్: మండలంలోని గొర్లి సీతారాంపురం పెట్రోల్ బంకు వద్ద రెండు లారీలు ఢీకొని ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో రాయగఢ నుంచి విశాఖపట్నం వెలుతున్న లారీ ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొని రోడ్డుపై నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉదయం 3 గంటల నుండి 9 గంటల వరకు విశాఖపట్నం నుండి బొబ్బిలి, బొబ్బిలి నుండి విశాఖపట్నం వెళ్లే వాహనాలు గొర్లి సీతారాంపురంలో నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న సిఐ సతీశ్ కుమార్ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రేన్‌తో సరిచేశారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

చీపురుపల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక చీపురుపల్లి పట్టణం రామాంజనేయ కాలనీకి చెందిన వడ్డాది తులసి (43) ఆత్మహత్య చేసుకుంది. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామాంజనేయ కాలనీలో తులసి తన భర్త క్షత్రియరాంసింగ్, కుమారుడు చంద్రశేఖర్ (7), కుమార్తె (9)లతో కలిసి ఉంటుంది. స్థానిక బియస్‌యన్‌ఎల్ కార్యాలయం ముందు పాన్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతురాలు స్టార్ ఫైనాన్స్‌లో రూ.4 లక్షలు, రాజాం గ్రామశక్తి ఫైనాన్స్‌లో రూ.1.5 లక్షలను రుణం తీసుకున్నారు. అయితే తీసుకున్న రుణాన్ని తీర్చలేక ఇబ్బందులకు గురై మనస్థాపం చెందిన తులసి బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని చీపురుపల్లి సిఐ శంకరరావు తన సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుమందు తాగి బాలిక మృతి

విజయనగరం కోట: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన తాటిపూడి దేవి(16) ఈ నెల21న విషం తాగి ఆత్మహత్యయత్నం చేసింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం బాలిక మృతి చెందింది. తండ్రి తాటిపూడి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ సిఐ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. అదే ప్రాంతానికి చెందిన పొడుగు చిన్న, దేవి గతేడాదిగా ప్రేమించుకుంటున్నారు. ఈ తరుణంలో బాలికను తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన బాలిక ఈ నెల 21న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి విషం తాగి తిరిగి మధ్యాహ్నం 12.30గంటలకు ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంది. గమనించి కుటుంబ సభ్యులు ఏమైందని ప్రశ్నించగా గుర్తు తెలియని విషం తాగేసానని చెప్పింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహారాజా ఆస్పత్రికి తరిలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ ఆమె ఆస్పత్రిలోనే మృతి చెందిందని సిఐ తెలిపారు.

పాన్‌షాప్ వద్ద కొట్లాట

బాడంగి: మండలంలోని డొంకినవలస ఎత్తి కానా దగ్గర ఉన్న వైన్ షాప్ ఎదురుగా పాన్‌షాప్ దగ్గర మంగళవారం రాత్రి ఆరుగురు వ్యక్తులు మధ్య గొడవ జరిగి కర్రలతో కొట్టుకున్నారు. ఇందులో నలుగురు ఇద్దరిపై కర్రలతో దాడిచేశారు. డొంకినవలసకు చెందిన వడ్డీ మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తారకేశ్వరవు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం మత్తులో ఆరుగురు యువకులు కొట్టుకున్నారని ఇందులో వడ్డీ మధు, వడ్డీ సురేష్‌కు గాయలయ్యాయని వీరు స్థానిక సామజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని కేసు నమోదు చేసశామని అన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

- 22 శాఖలకు 7 శాఖల అధికారులే హాజరు
- సగానికి పైగా సభ్యులు గైర్హాజరు

ప్రజాశక్తి- రేగిడి

గ్రామ సమస్యల పట్ల మూడు నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశంలో చర్చించి, వాటిని తక్షణమే పరిష్కారం దిశగా పనిచేయవలసిన అధికారులు, ప్రజాప్రతినిధుల తగిన స్థాయిలో హాజరుకాకపోవడంతో సమావేశం వాయిదా పడింది. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ధార అప్పల నరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపిటిసిలతో కోరం ఏర్పాటై సమావేశం ప్రారంభించారు. దీంతో ఎంపిపి అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపి అచ్చెంనాయుడును స్టేజి పైకి ఆహ్వానించారు. ఈ సమావేశానికి రెవెన్యూ, వ్యవసాయం, డిఆర్‌డిఎ వెలుగు, ఉపాధి హామీ, పశువైద్యం, విద్యుత్ శాఖ, ఐసిడిఎస్, ఉద్యానవనం శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఎంఇఒ వరప్రసాద్, రేగిడి, బూరాడ వైద్యాధికారులు అసిరినాయుడు, చలమయ్యలు ఓడి తీసుకొని విజయనగరం ఉన్నతాధికారుల సమావేశానికి హాజరయ్యారు.



సగానికి పైగా ఖాలీగా ఉన్న కుర్చీలు

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి శ్రీచరణ్ ఓడి తీసుకుని విజయవాడ సమావేశానికి హాజరయ్యారు. మిగతా శాఖలకు సంబంధించి ఇన్చార్జిలే ఉండడంతో దిగువ స్థాయి సిబ్బంది సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. దిగు స్థాయి సిబ్బంది సమావేశానికి హాజరవటంతో ఎంపిపి ఆదేశాలతో వైస్ ఎంపిపి అచ్చెంనాయుడు సమావేశం వాయిదా కోసం ఎంపిటిసిలకు చేతులెత్తే కార్యక్రమం చేపట్టారు. మెజార్టీ సభ్యులు వాయిదా తీర్మానం చేశారు. దిగువ స్థాయి సిబ్బంది హాజరుతోపాటు, సర్పంచ్ సభ్యులు సగానికి పైగా సమావేశానికి గైర్హాజరుతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. దీంతో సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశంలో ఎంపిడిఒ శ్యామలాకుమారి, తహశీల్దార్ చిన్నారావు, ఎపిఎం బాసిన గోవిందరావు, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, ఎఒ మురళీకృష్ణ పాల్గొన్నారు.

పాలవలసకు నివాళులు

అనంతరం ఎంపిపి ధార అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు అచ్చెంనాయుడు, జగన్మోహన్ రావుతో పాటు సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు మాజీ జెడ్‌పి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాలవలస రాజశేఖరం మృతి పట్ల సంతాపం తెలిపారు. మంచి రాజకీయ వేత్తను కోల్పోయామన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుపై చర్చ

ప్రజాశక్తి - కొత్తవలస, ఎల్‌కోట

కొత్తవలసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు విషయంలో సాధ్యాసాధ్యాలపై ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో విద్యా కమిటీ సభ్యులు బుధవారం లక్కవరపుకోట మండల కేంద్రంలో ఆమె క్యాంపు కార్యాలయంలో చర్చించారు. కమిటీ సభ్యులు కేశవరావు, కృష్ణాజీతో ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా కొత్తవలస మండలంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం గతేడాది జూలైలో సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. నవంబర్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభా సమావేశాలలో కూడా ప్రస్తావించానన్నారు. ఇందులో భాగంగా సిఎంఒ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ వారు చీపురుపల్లి, ఎస్.కోట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్‌ను కమిటీలో వేస్తూ కొత్తవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపన, అకాడమిక్ కోర్సులు, ఇతరితర సాధ్యాసాధ్యాలపై పరిశీలించాలని కమిటీని ఆదేశించారన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సంప్రదించి కళాశాల డిమాండ్‌ను విశ్లేషించి, వారం రోజుల్లో స్థానిక అంశాలను పరిశీలించిన తర్వాత నిర్దిష్ట వ్యాఖ్యలతో పాటు నిర్దిష్ట ప్రొఫార్మాలో వారి నివేదికను తదుపరి చర్య తీసుకోవడానికి వీలుగా సమర్పిస్తామన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో 2025-26 నూతన అకాడమిక్ క్యాలెండర్ నుంచి డిగ్రీ తరగతులను, కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తూ, జూనియర్ కళాశాలలో మిగిలిన 5 ఎకరాలలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటు పట్ల సాధ్యాసాధ్యాలపై చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని డి.తాళ్లవలసలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు భోగాపురం రూరల్ సిఐ జి.రామ కృష్ణ ఆధ్వర్యంలో గ్రామ లలో ప్రధాన కూడళ్లలో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. నేరాలు నియంత్రించేందుకు ఈ కెమె రాలు ఎంతో ఉపయోగపడతా యన్నారు. వీటిని గ్రామస్తులు, పెద్దల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వారి పట్టాలు రద్దు చేస్తాం

రామభద్రపురం: గతంలో ప్రభుత్వం ద్వారా ఇళ్ల నిర్మాణాల కోసం పట్టాలు పొంది నిర్ణీత గడువులోగా నిర్మాణాలు చేయని పట్టాలు రద్దు చేసేందుకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. ఈ మేరకు బుధవారం సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్.చింతలవలస రెవెన్యూ గ్రామసర్వే నెంబర్ 148/2లో 17.71 ఎకరాల విస్తీర్ణంలో పేదల ఇండ్ల స్థలాలకు కేటాయించి లే- అవుట్ వేసి ఇందులో 565 మంది లబ్ధిదారులకు పట్టాలు జారీ చేశామన్నారు. అయితే తమ సిబ్బంది ఆధ్వర్యంలో పూర్తి స్థాయి ఫీల్డ్ సర్వే చేయగా ఇంకా 71 మంది లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టనట్లు గుర్తించామన్నారు. వారందరికీ ఈ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని నోటీసులు ఇచ్చా మన్నారు. అలా ప్రారంభించని వారి పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇంతవరకు లబ్ధి పొందని వారు, ఇళ్ళు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టినవారిని గుర్తించి వారికి ఈ రద్దు చేసిన పట్టాలు మంజూరుకు సిఫార్సు చేస్తామన్నారు.



లబ్ధిదారులను విచారిస్తున్న తహశీల్దార్ రాములమ్మ

ఇళ్ల పట్టాలపై దర్యాప్తు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాంలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇంటి పట్టాలపై సర్పంచ్ ఎర్ర రామసత్యవతి ఆధ్వర్యంలో తహశీల్దార్ జె.రాములమ్మ బుధవారం దర్యాప్తు చేపట్టారు. ఈ గ్రామంలో అనర్హులకు పట్టాలిచ్చారని కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. దీనికి స్పందించిన ప్రభుత్వం గ్రామంలో దర్యాప్తు చేయాలని ఆదేశించడంతో తహశీల్దార్ ఆరుగురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జనపరెడ్డి ఈశ్వరరావు, ఎర్ర సన్యాసిరావు, ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ జగ్గారావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అగ్ని ప్రమాదంలో ధాన్యంపురులను కోల్పోయిన 8 మంది రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులు, నాయకులు తహశీల్దార్ అరుణ్ కుమారికి వినతి పత్రం అందజేశారు. వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ సోమవారం రాత్రి మామిడిపల్లి గ్రామానికి చెందిన కిలారి వారి కళ్ళల్లో రైతులు పండించిన వరి పంటను 8 మంది రైతులు పురులు కట్టి ఉంచారన్నారు. ఆ రాత్రి భోజనం సమయం కావడంతో రైతులంతా ఇళ్లకు భోజనం నిమిత్తం వెల్లారని భోజనం చేసి తిరిగి వచ్చేసరికి పురుకట్టిన ధాన్యం, ధాన్యం బస్తాలు గడ్డి కుప్పలు మొత్తం అగ్ని ప్రమాదానికి గురయ్యాయని చెప్పారు. ఈ 8 మంది పేద రైతులు తాము తినగా మిగలిన ధాన్యాన్ని మార్కెట్‌లో అమ్మి వారి కుటుంబం



తహశీల్దార్‌కు వినతినిస్తున్న నాయకులు, రైతులు

పోషణ చేసుకుందామని అనుకున్న సమయంలో అగ్నిప్రమాదంలో ధాన్యం కాలిపోయాయన్నారు. ప్రతి ఒక్క రైతు ఎకరాకి రూ.25 నుంచీ 30 వేల రూపాయల వరకు సుమారు ఖర్చు పెట్టారని, పంటవచ్చాక అప్పు తీరుద్దామనుకున్నా రైతన్న చివరికి కన్నీరేమిగిలిందని, సుమారు 10 లక్షలు నష్టం జరిగిందని, అధికారులు, కూటమి ప్రభుత్వం పరిశీలించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు వంశీ, భవానీ, శ్రీనివాసరావు, అప్పలనాయుడు, ఈశ్వరరావు, రాజేష్, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరిపాక నాటక పరిషత్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కళాకారుడు, విశ్రాంత ఉపాధ్యాయులు కీర్తి శేషులు ఆరిపాక బ్రహ్మానందం స్మారక రెండు రాష్ట్రాల స్థాయిలో ఆహ్వాన నాటక పరిషత్ పోటీలు జయప్రదం చేయాలని డిసిసిబి మాజీ వైస్ చైర్మన్, జనసేన నాయకులు చనమల్ల వెంకటరమణ పిలుపునిచ్చారు. బుధవారం జరజాపుపేట వెంకట మురళీకృష్ణ కళ్యాణ మండపంలో కీర్తిశేషులు ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటక పరిషత్ పోటీలు బ్రోచర్‌ని గ్రామస్థుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరిపాక బ్రహ్మానందం స్మారకార్థం వచ్చే నెలలో కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో నాటక పరిషత్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మానందం ఉపాధ్యాయులుగా సేవలందిస్తూ, రంగ స్థలం కళాకారుడిగా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకొని కళరంగానికి సేవ చేశారని కొనియాడారు. ఆయనను స్మరించుకుంటూ ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటక పరిషత్ పోటీలు వచ్చే నెల 20నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నేషనల్ ఆర్ట్ సమాజ్, నేషనల్ ఆర్ట్ ప్రోడక్షన్, జరజాపుపేట సంయుక్త నిర్వహణలో వెంకటేశ్వర మురళీకృష్ణ కల్యాణమండపంలో మూడు రోజులు పాటు జరుగుతాయని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామస్థులు అవునాపు సత్యనారాయణ, నల్లి శేఖర్, ఎంఎం నాయుడు, కిల్లంపల్లి రామారావు, తుమ్ము వెంకట రమణ, మన్యపురి మోహనరావు, బోలె సత్య నారాయణ, పి. అప్పలరాజు, కుటుంబ సభ్యులు ఆరిపాక కృష్ణమాచారి, ఆరిపాక శ్రీనివాసరావు, ఆరిపాక రాము తదితరులు పాల్గొన్నారు.

రామారావు మృతి ప్రజా ఉద్యమాలకు లోటు

ప్రజాశక్తి- గంట్యాడ

కొటారుబిల్లికి చెందిన డప్పు కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములగాడ రామారావు అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్, డప్పు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షులు రాకోటి రాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాస్ అన్నారు. జిల్లాలో దళితులు, డప్పు కళాకారులు, వ్యవసా కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేసిన రామారావు మంగళవారం ఉదయం అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఈ మేరకు ఆయన మృతదేహాన్ని సందర్శించి ప్రజా సంఘాలుగా నివాళులు అర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామారావు గత కొంతకాలంగా అర్హులైన డప్పు కళాకారుల, పింఛనులు, దళిత సమస్యలు సాధన కోసం, ఉపాధి కూలీల హక్కు కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన అకాల మరణం ఉద్యమానికి తీరని లోటని అందరూ ఆయన ఆశయాలు సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములగాడ ఎల్లయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



రామారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పొదుపు సంఘాల అప్పులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని ముత్తాయివలసలో పొదుపు సంఘాల అప్పులపై విఒఎపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఎపియం పి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో 43 పొదుపు సంఘాలు ఉన్నాయని ఈ సంఘాలన్ని బ్యాంకు లింకేజ్ రుణాలతో పాటు 8 సంఘాలు స్త్రీనిధి రుణాలు తీసుకొన్నాయని చెప్పారు. అవకతవకలు జరిగినట్లుగా ఫిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించి మూడు రోజుల్లో ఉన్నత అధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ వసుంధరా దేవి, సీసీలు కోటేశ్వరరావు, నిర్మల, కేశవరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని ఒమ్మిలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్, జనసేన నాయకులు అంబళ్ల అప్పలనాయుడు ఆధ్వర్యంలో పశువైద్యాధికారి ప్రవీణ్ శిబిరం నిర్వహించి తనిఖీ చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాడి రైతులు పశువుల ఆరోగ్యం పై దృష్టి సారించి దిగుబడి పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వెటర్నరీ అసిస్టెంట్ నారాయణరావు రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని చింతాడ, కారాడ గ్రామాలలో బుధవారం పశువైద్య శిబిరాన్ని పక్కి, పిరిడి పశు వైద్యాధికారులు సుధాకర్, అనితల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో అనారోగ్య పశువులకు చికిత్సలు, నట్టల నివారణ మందులు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, కృత్రిమ గర్భధారణ, చూడి తనిఖీలు నిర్వహించి 546 పశువులకు చికిత్సలు, 1000 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. ఈ నెల 23న నారశింహుని పేట, కమ్మవలస గ్రామంలో పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

మెరకముడిదాం: మండలంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తుందని మండల పశు వైద్యధికారి సిహెచ్ హైమావతి తెలిపారు. బుధవారం మండలంలోని ఉత్తరావిల్లి, జి. మర్రివలస పంచాయతీల్లో ఈ శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 1568 పశువులకు, 883 సన్నజీవులకు నట్టల మందు వేసామని, 9పశువులకు ఎద ఇంజాంక్షన్లు, 28పశువులకు చూడు పరీక్షలు నిర్వహించామని ఆమె తెలిపారు. 860 ఎదకురాని, చూలు కట్టని పశువులకు, గర్భకోస వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసామని, 600సన్న జీవాలకు షీప్‌పాక్స్, గోట్ పాక్స్ టీకాలు, 800 కోళ్లకు పౌల్ పాక్స్ టీకాలు వేసామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్నపేటలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ కోరాడ గాయత్రి తెలిపారు. ఈ శిబిరంలో ఐదు కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, పది చూలు తనిఖీలు, 22 గర్భకోస వ్యాధులకు చికిత్సలు, 20 సాధారణ చికిత్సలు, 800 గొర్రెలు, మేకలకు, 55 పెయ్యిలు, 46 పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. ఈ శిబిరంలో సర్పంచ్ దుక్క వెంకటరావు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: పశువులను తనిఖీ చేస్తున్న వైద్యుడు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కీర్తి

గిరిజన గ్రామాన్ని సందర్శించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని తాటిపూడి జలాశయం అవతల ఉన్న దిగువ కొండపర్తి గిరిజన గ్రామాన్ని బుధవారం మధ్యాహ్నం ఆర్‌డిఒ దాట్ల కీర్తి సందర్శించారు. గ్రామంలో గిరిజన హౌసింగ్ లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ల జారీ సమస్యపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దిగవ కొండపర్తి గ్రామాన్ని ఆమె సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలం తాటిపూడి ఇరిగేషన్ ప్రాజెక్టు స్థలమా? రెవెన్యూ స్థలమా అన్న విషయమై పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ జిల్లా పీడీ కూర్మినాయుడు, డి. రాజగోపాల్, తహశీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి, రెవెన్యూ ఇనెస్పెక్టర్ ప్రసాద్, హౌసింగ్ అధికారి రాజగోపాల్ స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.